సాక్షి
నాగర్‌కర్నూల్

మంగళవారం । 10 । జూన్ । 2025



అనుమతులు రద్దు చేయాలి

ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు.

వివరాలు 8లో ▸



ఉత్సాహంగా క్రికెట్ లీగ్

ఇంట్రా డిస్ట్రిక్ట్ అండర్- 25 ఉమెన్ క్రికెట్ లీగ్ ఉత్సాహంగా ప్రారంభమైంది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
38.6 /20.9

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. సాయంత్రం జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పోలీస్ ప్రజావాణికి 12 ఫిర్యాదులు



నాగర్‌కర్నూల్ క్రైం: పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు ఎస్పీ రామేశ్వర్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 12 ఫిర్యాదులు అందగా.. 6 భూ తగాదాలపై, 4 వివిధ కేసుల్లో న్యాయం చేయాలని, 2 భార్యాభర్తల గొడవలపై ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.

పేదల పక్షాన నిరంతర పోరాటం



తాడూరు: పేదల పక్షాన సీపీఐ నిరంతరం పోరాడుతోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ అన్నారు. సోమవారం తాడూరు మండలం నాగదేవపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసమానతలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా కమ్యూనిస్టులు పనిచేస్తున్నట్లు తెలిపారు. పేదల జీవన మార్పునకు నాంది పలికిన జెండా ఎర్రజెండా అని అన్నారు. దోపిడీ, అన్యాయం, అణచివేత ఉన్నంతకాలం ఎర్రజెండా ఉంటుందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భరత్, నాయకులు వార్ల వెంకటయ్య, జంగన్న ఉన్నారు.

స్పాట్ కౌన్సెలింగ్

వనపర్తి రూరల్: జిల్లాకేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 15న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు గిరిజన సంక్షేమ కళాశాల ప్రిన్సిపాల్ సరస్వతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేవలం ఎస్టీ బాలికలకు మాత్రమే అవకాశం ఉంటుందని.. అన్ని ధ్రువ పత్రాలతో కళాశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్‌నంబర్ 94909 57315 సంప్రదించాలని సూచించారు.

నయా వెట్టి..!

కృష్ణాతీరంలో చేపల వేట కోసం కూలీల అక్రమ రవాణా



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు గౌరీశంకర్. కాకినాడకు చెందిన ఈయన ఉపాధి కోసం విజయవాడ వచ్చాడు. రైల్వేస్టేషన్‌లో రాము అనే వ్యక్తి గౌరీశంకర్‌ను పరిచయం చేసుకున్నాడు. కొల్లాపూర్‌లో చేపల కంపెనీలో ప్యాకింగ్ ఉద్యోగం ఉందని.. నెలకు రూ.15 వేల జీతం ఇస్తారని చెప్పాడు. రోజుకు 6 గంటలు మాత్రమే పనిచేయాలని, రూము, భోజనం ఉచితంగా ఉంటాయని నమ్మబలికాడు. గౌరీశంకర్ పనికి ఒప్పుకోవడంతో వెంటనే విజయవాడలో ఓ లాడ్జికి తీసుకెళ్లి మరో దళారీకి అప్పగించాడు. మరుసటి రోజు మరికొందరు కూలీలతో కలిసి కొల్లాపూర్ మండలం మల్లేశ్వరం సమీపంలో కృష్ణాతీరానికి తీసుకొచ్చారు. ఆరు నెలల పాటు పనులు చేయించుకున్నారు. ఒక్క రూపాయి కూడా జీతం ఇవ్వలేదు. తిండి కూడా అరకొరగానే పెట్టారు. ఓ సంస్థ సహకారంతో నిర్బంధం నుంచి గౌరీశంకర్‌తోపాటు మరికొందరు కార్మికులు విముక్తి పొందారు. రవాణా చార్జీలు ఇచ్చి అధికారులు వారిని స్వగ్రామాలకు పంపించారు. పనిచేసినందుకు జీతాలు మాత్రం ఎవరికీ ఇవ్వలేదు.

.. ఇదీ కృష్ణానది తీరంలో నిర్బంధ కార్మికుల దుస్థితి. అలివి వలలు లాగేందుకు ప్రతి సంవత్సరం వందల సంఖ్యలో కార్మికులను ఇలా మాయమాటలు చెప్పి చేపల వ్యాపారులు తీసుకొస్తున్నారు. హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, కర్నూలు రైల్వే స్టేషన్లలో దళారులను ఏర్పాటు చేసుకొని కూలీల అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు.

- సాక్షి, నాగర్‌కర్నూల్/కొల్లాపూర్



ఇటీవల నిర్బంధం నుంచి విముక్తి పొంది ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్న కార్మికులు (ఫైల్)

- చేపల కంపెనీలో ప్యాకింగ్ ఉద్యోగాలని నమ్మిస్తున్న దళారులు
- నదీతీరంలో వ్యాపారులకు అప్పగిస్తున్న వైనం
- 18 గంటల పాటు పనులు.. జీతాలు ఇవ్వకుండా వేధింపులు
- ఇటీవల 80 మంది నిర్బంధ కార్మికులకు విముక్తి

చిన్నంబావి మండలంలోని కృష్ణా నదీ తీరం నుంచి శ్రీశైలం డ్యాం వరకు పదుల సంఖ్యలో అలివి గుడారాలు ఉంటాయి. ఒక్కొక్క గుడారంలో 20 నుంచి 30 మంది వరకు నిర్బంధ కార్మికులు పనిచేస్తుంటారు. ఈ గుడారాలన్నీ నదీతీరంలో అందరికీ కనిపించే దూరంలోనే ఉంటాయి. కానీ అధికారులు మాత్రం అక్కడికి వెళ్లరు. ఎప్పుడైనా తనిఖీలు చేయాల్సి వస్తే.. ముందుగానే వ్యాపారులకు సమాచారం అందుతుంది. అధికారులు వచ్చేలోపు వ్యాపారులు తమ స్థావరాలను మరో చోటికి మార్చడం పరిపాటిగా మారింది.

ఫిర్యాదులు అందినా..

అలివి వలలతో చేపల వేట నిషేధం. కానీ, కృష్ణానదిలో అలివి వేట విచ్చలవిడిగా సాగుతోంది. చేపల వేట కోసం వేర్వేరు ప్రాంతాల నుంచి కార్మికులను తీసుకొస్తారు. వారి సమాచారం ఎక్కడా నమోదు కాదు. కార్మికులు నదిలో పడి చనిపోయినా వారి వివరాలను గోప్యంగా ఉంచుతున్నారు. కృష్ణాతీరంలోని మల్లేశ్వరం, సోమశిల తదితర ప్రాంతాల్లో చోటు చేసుకుంటున్న బాండెడ్ లేబర్ దందాపై ఫిర్యాదులు చేసినా సంబంధిత అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కార్మికులకు విముక్తి ఇలా..

ఏపీలోని భీమవరం ప్రాంతానికి చెందిన గణేశ్‌ను నాలుగు నెలల క్రితం ఓ బ్రోకర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి మల్లేశ్వరం తీసుకొచ్చాడు. అక్కడ ఓ చేపల వ్యాపారికి అతడిని అప్పగించాడు. అతడి ఫోన్ లాగేసుకున్నారు. గణేశ్ ఎక్కడికి వెళ్లాడో తెలియకపోవడంతో అతడి భార్య భీమవరంలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. నేషనల్ ఆదివాసీ సాలిడారిటీ సెంటర్(ఎన్‌ఏఎస్‌సీ) సభ్యులను కూడా కలిసింది. వారు నాగర్‌కర్నూల్ జిల్లాలోని తమ సంస్థ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వెళ్లి నదీతీరంలో వెతకగా.. అక్కడ గణేశ్ కనిపించాడు. అతడితోపాటు మరో 39 మంది నిర్బంధ కార్మికులను స్థానిక పోలీసుల సహకారంతో పెంట్లవెల్లి మండల రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఇందులో చైన్నె, ఒడిశా, నెల్లూరు, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, జార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. వీరంతా మల్లేశ్వరం, సంగమేశ్వరం, బోనాసి, మంచాలకట్ట, అమరగిరి ప్రాంతాల్లో నిర్బంధంలో ఉన్న కార్మికులు. నాలుగు నెలల క్రితం 28 మంది కార్మికులను కూడా ఇదే తరహాలో అధికారులకు అప్పగించారు. ఇటీవలి కాలంలో మొత్తం 80 మందికి పైగా కార్మికులకు నిర్బంధం నుంచి విముక్తి లభించింది.

వ్యాపారులకే లబ్ధి..

నిర్బంధ కార్మికులకు విముక్తి కల్పించామని అధికారులు చెబుతున్నప్పటికీ.. పరోక్షంగా వారు చేపల వ్యాపారులకు లబ్ధి చేకూరుస్తున్నారు. నిర్బంధ కార్మికులు, స్వచ్ఛంద సంస్థలు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ ఎక్కడా వ్యాపారులపై కేసులు నమోదు కావడం లేదు. నెలల తరబడి పనులు చేసిన కార్మికులకు వ్యాపారుల నుంచి జీతాలు ఇప్పించడం లేదు. కేవలం రవాణా చార్జీలు ఇచ్చేసి కార్మికులను తమ స్వగ్రామాలకు పంపిస్తున్నారు. అధికారుల ఉదాసీనత కారణంగా ఒక్కో కార్మికుడిపై రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వ్యాపారికి మిగులుతున్నాయి. ఇదే బాగుందని కొందరు వ్యాపారులు ఉద్దేశపూర్వకంగానే అధికారులకు స్వయంగా ఫోన్లు చేసి కార్మికులను అప్పగిస్తున్నారు. ఇదో రకమైన నయా మోసమని కార్మికులు వాపోతున్నారు.

హైదరాబాద్ నుంచి తీసుకొచ్చారు..



ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చా. పనులు దొరక్కపోవడంతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఉండేవాడిని. ఓ వ్యక్తి పరిచయమై చేపల కంపెనీలో పనిచేసేందుకు పిలిచాడు. అడ్రస్ చెప్పలేదు. అతడి వెంట వచ్చా. మల్లేశ్వరంలో ఓ వ్యక్తికి అప్పగించాడు. 5 నెలలుగా కృష్ణానదిలో చేపల వలలు లాగే పనులు చేశా. రోజు అన్నంతోపాటు కారం పొడి పెట్టేవారు. లేదంటే చేపలు వండుకొని తినాలి. రాత్రి, పగలు పనిచేయాలి. పని చేయలేమంటే కొట్టేవారు. మూత్రానికి వెళ్లినా ఒకరిద్దరు మాకు కాపలా ఉంటారు. పనిచేసినందుకు జీతాలు మాత్రం ఇవ్వలేదు. అధికారులు జీతాలు ఇప్పించకుండానే మా ఊళ్లకు పంపించారు.

- రాహుల్, బెంగుళూరు

పోలీసులకు ఫిర్యాదు..

కార్మికుల నిర్బంధం గురించి రెవన్యూ పరంగా పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నాం. ఇటీవల చాలామంది కార్మికులకు నిర్బంధం నుంచి విముక్తి కల్పించాం. కార్మికులకు రవాణా చార్జీలు ఇచ్చి వారి స్వగ్రామాలకు పంపిస్తున్నాం. వారి వెంట రెవెన్యూ అధికారులు కూడా వెళ్తున్నారు. కేసుల నమోదు అంశం పోలీసు శాఖ పరిధిలోనిది. దీన్ని కూడా పర్యవేక్షిస్తాం.

- భన్సీలాల్, ఆర్డీఓ, కొల్లాపూర్

పాఠశాలల పనితీరు మెరుగుపరుస్తాం



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

- పుస్తకాలు, యూనిఫాంల పంపిణీకి సిద్ధం
- బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించేందుకు చర్యలు
- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్: ఆకస్మిక తనిఖీలతో ప్రభుత్వ పాఠశాలల పనితీరు మెరుగుపరిచి.. జిల్లాలో విద్యారంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి సీఎస్ రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమశాఖ మంత్రి సీతక్క కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి.. పాఠశాలల పునఃప్రారంభం రోజున విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ, మహిళల అభ్యున్నతికి సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంక్‌ల ఏర్పాటు, స్వయం సహాయక మహిళా సంఘాల భవనాల నిర్మాణాలు, సంఘాల్లో కోటి మంది మహిళలను చేర్చడం తదితర అంశాలపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 12వ తేదీనే ప్రతి విద్యార్థికి యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు అందిస్తామన్నారు. పాఠశాలల పునఃప్రారంభోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో మాదిరిగానే ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి.. విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా చూస్తామన్నారు. జిల్లాలో బడిబాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని.. బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలతో పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు అవసరమైన స్థల సేకరణ పూర్తి చేస్తామన్నారు. జిల్లా కేంద్రంలో చేపట్టిన మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులను నవంబర్ నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ పెంచినట్లు వివరించారు. శిథిలావస్థకు చేరిన తరగతి గదుల్లో విద్యార్థులను కూర్చొబెట్టకుండా చూస్తామని కలెక్టర్ తెలిపారు.

ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచొద్దు..

ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో సుదూరం నుంచి ప్రజలు వచ్చి అర్జీలు సమర్పిస్తున్నారని.. అధికారులు ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయవద్దని సూచించారు. వివిధ సమస్యలపై 35 అర్జీలు వచ్చాయని.. వాటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.అమరేందర్, దేవ సహాయం తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందిస్తున్న ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ

చారకొండ: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. చారకొండ రైతువేదికలో సోమవారం 240మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. అనంతరం ఇందిరమ్మ మోడల్ హౌస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసి పథకాలు అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మొదటి జాబితాలో పేరు రాలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బాలాజీ సింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, మాజీ జెడ్పీటీసీ వెంకట్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకటయ్య యాదవ్, మహేందర్, జైపాల్ పాల్గొన్నారు.

అమ్మమాట.. అంగన్‌వాడీ బాట

వినూత్న కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం

- రెండున్నరేళ్లు పైబడిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చర్పించడమే లక్ష్యం
- నేటి నుంచి 17వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు



అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారులు (ఫైల్)

అచ్చంపేట: చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య ఎంతో కీలకం. వారు పాఠశాలల్లో చేరే నాటికి అక్షరాలు, అంకెలు నేర్పి ఆటపాటలతో కూడిన విద్య అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రెండున్నరేళ్లు దాటిన చిన్నారులను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేందుకు మంగళవారం నుంచి 17వ తేదీ వరకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'అమ్మమాట–అంగన్‌వాడీ బాట' పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు. అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17న సామూహికంగా అక్షరభ్యాసం చేయించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలోనే అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన చిన్నారులకు ఉచితంగా యూనిఫాం అందించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు: 4	అంగన్‌వాడీ కేంద్రాలు: 1,131
ఆరేళ్లలోపు చిన్నారుల సంఖ్య: 46,229	
గర్భిణులు: 5,745	బాలింతలు: 3,772

మానసిక ఒత్తిడికి లోనుకాకుండా..

ప్రైవేటు పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీప్రైమరీ విద్య అందిస్తున్నారు. పిల్లలపై ఎలాంటి మానసిక ఒత్తిడి కలగకుండా నిపుణుల సూచన మేరకు ఆటలు, పాటలు, కథల ద్వారా చిన్నారులకు చదువుపై ఆసక్తి పెంపొందిస్తున్నారు. చిన్నారులను ఆకట్టుకునే విధంగా సిలబస్ రూపొందించారు. అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నుంచి యూనిఫాం అందజేస్తోంది.

బడిబాట పట్టేలా..

అంగన్‌వాడీ కేంద్రాల్లోని 3–6 ఏళ్ల పిల్లలను బడిబాట పట్టించేందుకు సిద్ధం చేస్తున్నారు. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్స్‌గా భావించేవారు. చిన్నారులు పాఠశాల వాతావరణానికి అలవాటయ్యేలా.. పౌష్టికాహారం అందించి, ఆటలు ఆడించి, బడి అంటే భయం పోగొట్టే కేంద్రాలు అని అనుకునేవారు. అయితే గతేడాది నుంచి మార్పులు తెచ్చారు. కేవలం పౌష్టికాహారం అందించడం, ఆటపాటలతో గడపడమే కాకుండా.. వారికి విజ్ఞానాన్ని అందించేందుకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు వర్క్‌బుక్కులు అందించి.. వారితో హోంవర్క్ చేయిస్తున్నారు. ఎల్‌కేజీ వారికి తంగేడు పువ్వు పేరుతో నాలుగు పుస్తకాలు, యూకేజీ వారికి పాలపిట్ట పేరిట ఐదు పుస్తకాలు రూపొందించి ఆటపాటలతో బోధించారు. ప్రస్తుతం నిపుణ్ భారత్ ద్వారా వచ్చిన ప్రియదర్శిని పుస్తకంతో సులభ పద్ధతుల్లో విద్యా బోధనతో చిన్నారుల మేధస్సు వికసించనుంది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు..

ప్రభుత్వ ఆదేశాల మేరకు వారం రోజులపాటు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహిస్తాం. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు అలవాటు చేసి ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్య అందించడమే ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశం. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి అంగన్‌వాడీ టీచర్, ఆయాలు కృషి చేయాలి.

- రాజేశ్వరి, డీడబ్ల్యూఓ

కార్యక్రమాలు ఇలా..

➪ 10న అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, తల్లిదండ్రుల గ్రూప్ సెల్ఫీ, గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు, మహిళా స్వయం సహాయక సంఘాలతో సమావేశం.

➪ 11న మూడేళ్లు పైబడిన చిన్నారుల నివాసాలకు వెళ్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం.. పిల్లలను చేర్చేలా ప్రోత్సహించడం చేపట్టాలి. అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు దాటిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి ప్రైమరీ స్కూళ్లలో చేర్పించాలి.

➪ 12, 13, 16 తేదీల్లో పోషణ్ కిచెన్ గార్డెన్, పోషకాహార వివరాలను హైలెట్ చేసి, స్టడీ మెటీరియల్ పంపిణీ చేయాలి. చైల్డ్ ఫ్రెండ్లీ వాతావరణం అంగన్‌వాడీల్లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

➪ 17న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్లీ చైల్డ్ హుడ్ కేర్ డెవలప్‌మెంట్ డే, సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తారు. గ్రామపెద్దలు, చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించి పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన కల్పిస్తారు. కేంద్రాలకు సరఫరా అయిన బోధన, ఆట వస్తువులను ప్రదర్శిస్తారు.

టీపీసీసీలో మనోళ్లు

ఉమ్మడి పాలమూరు నుంచి ఆరుగురికి చోటు

- ఉపాధ్యక్షుడిగా అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ
- ప్రధాన కార్యదర్శులుగా 'పేట' ఎమ్మెల్యే పర్ణికారెడ్డితోపాటు మరోనలుగురు



ఎమ్మెల్యే వంశీకృష్ణ



ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: టీపీసీసీ కార్యవర్గంలో ఉమ్మడి పాలమూరు జిల్లాకు పెద్దపీట వేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల నియామక జాబితాను సోమవారం ఏఐసీసీ విడుదల చేసింది. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు, నలుగురు నాయకులకు చోటు దక్కింది. గతంలో ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు టీపీసీసీ ఉపాధ్యక్షులుగా, ఐదుగురు ప్రధాన కార్యదర్శులుగా ఉండగా.. ఈసారి ఆరుగురికి కార్యవర్గంలో చోటు కల్పించారు.

కార్యవర్గంలో ఇద్దరు ఎమ్మెల్యేలు

రాష్ట్రవ్యాప్తంగా టీపీసీసీ ఉపాధ్యక్షులుగా 27 మందిని ఎంపిక చేయగా వీరిలో ఉపాధ్యక్షుడిగా అచ్చంపేట ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్ డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ నియమితులయ్యారు. అదేవిధంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శులుగా 69 మందితో జాబితా ప్రకటించగా ఉమ్మడి జిల్లా నుంచి నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి చెందిన సంజీవ్ ముదిరాజ్, ఏపీ మిథున్‌రెడ్డి, గద్వాల నియోజకవర్గానికి చెందిన యువజన కాంగ్రెస్‌లో పనిచేసిన ఎం.రాజీవ్‌రెడ్డి, వనపర్తి నియోజకవర్గానికి చెందిన నందిమల్ల యాదయ్య ముదిరాజ్‌లను ఎంపిక చేశారు.

త్వరలోనే డీసీసీ అధ్యక్షుల ఎంపిక?

టీపీసీసీ కార్యవర్గాన్ని నియమించడంతో త్వరలోనే డీసీసీ అధ్యక్షులు, ఇతర కార్యవర్గాన్ని ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులు మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవుల కోసం ఆశావాహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మరో వారంలో రోజుల్లో పూర్తి స్థాయిలో డీసీసీ కార్యవర్గాన్ని ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

వీరిలో సంజీవ్ ముదిరాజ్ ప్రస్తుత కార్యవర్గంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతుండగా మళ్లీ అదే పదవిని కట్టబెట్టారు.

కార్యకర్తల్లో హుషారు

టీపీసీసీ కార్యవర్గాన్ని ఎంపిక చేయడంపై ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ కార్యకర్తల్లో హుషారు నింపింది. ఇప్పటికే మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి రాష్ట్ర మంత్రిగా అవకాశం కల్పించగా.. టీపీసీసీ కార్యవర్గంలో ఉమ్మడి జిల్లా నుంచి ఆరుగురు నాయకులకు చోటు దక్కడంతో కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పకడ్బందీగా టీజీపీఈ సెట్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా వివిధ బీపెడ్, డీపెడ్ కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం నిర్వహించే టీజీపీఈ సెట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు పీయూ వీసీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం పీయూలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రస్థాయి ప్రవేశ పరీక్షను నిర్వహించే బాధ్యతను ప్రభుత్వం పీయూకు అప్పగించిందన్నారు. దీన్ని విజయవంతంగా నిర్వహిస్తే భవిష్యత్‌లో మరిన్ని పరీక్షలు నిర్వహించేందుకు అవకాశం లభిస్తుందన్నారు. ఈ నెల 11నుంచి 14 వరకు పీయూలో నిర్వహించే ఈవెంట్స్‌కు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈవెంట్స్‌ను రాష్ట్ర హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ బాలకిష్టారెడ్డి హాజరై ప్రారంభిస్తారన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, సెట్ కన్వీనర్ దిలీప్ ఉన్నారు.

పునరావాస పనుల్లో వేగం పెంచాలి



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన నార్లాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితుల కోసం చేపట్టిన పునరావాస పనులను వేగంగా పూర్తిచేయాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. ఎల్లూరు శివారులోని సారంగం సమీపంలో పునరావాస కాలనీ ఏర్పాటు చేయాలని భావిస్తుండగా.. అందుకు బదులుగా మరో చోట ఎత్తైన ప్రాంతంలో చేపట్టాలన్న నిర్వాసితుల డిమాండ్‌ను పరిశీలించాలని సూచించారు. బోడబండతండా, సున్నపుతండా, దూల్యానాయక్‌తండా, అంజనగిరి తండా, వడ్డె గుడిసెలు తదితర గ్రామాలకు చెందిన 117 మంది నిర్వాసితుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే ఏర్పాటుచేసిన నార్లాపూర్, ఎల్లూర్ గ్రామాల నిర్వాసితులకు ఇంకా పూర్తిస్థాయిలో పరిహారం అందాల్సి ఉండగా, త్వరగా చెల్లించాలని ఆదేశించారు.

క్లుప్తంగా

కుంటలో పడి వ్యక్తి మృతి


లింగస్వామి (ఫైల్)

పెద్దకొత్తపల్లి: కుంటలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం పెద్దకారుపాములలో చోటుచేసుకున్నది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కాళ్లలింగస్వామి(37) సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు గ్రామంలోని ఈదోనికుంటలో పడిమృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు కుంటలో గాలించగా.. అప్పటికే మృతిచెందగా.. మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడి భార్య నిర్మలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.

టిప్పర్ ఢీకొని వృద్ధుడి దుర్మరణం


మైసయ్య మృతదేహం

మిడ్జిల్: మిడ్జిల్–కొత్తూర్ రోడ్డుకు మట్టి తరలిస్తున్న టిప్పర్ ఢీకొని మిడ్జిల్‌కు చెందిన వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకున్నది. ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు కథనం ప్రకారం.. మిడ్జిల్‌కు చెందిన మైసయ్య(65) సోమవారం ఉదయం కేఎల్‌ఐ కాల్వ సమీపంలోని వ్యవసాయ పొలానికి వెళ్తున్నాడు. మిడ్జిల్–కొత్తూర్ రోడ్డుకు మట్టి తరలిస్తున్న టిప్పర్ ఢీ కొట్టడంతో మైసయ్య తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడిపై దాడి.. చికిత్స పొందుతూ మృతి

బల్మూర్: పాత కక్షలతో తండ్రి, కుమారుడు కలిసి ఓ వృద్ధుడిపై దాడి చేయగా చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. అచ్చంపేట సీఐ నాగరాజు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కమ్మరి రేణయ్య (72)ను అదే గ్రామానికి చెందిన బోయ ఎర్రయ్య, అతడి కుమారుడు శివ కలిసి పాత కక్షలతో ఆదివారం ఇంట్లో నుంచి బయటకు లాగి తీవ్రంగా చితకబాదారు. దీంతో అతడి తలకు తీవ్ర గాయం కావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో అచ్చంపేటలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి తిరిగి ఇంటికి తీసుకొచ్చారు. సోమవారం ఉదయం చూడగా మృతి చెంది ఉన్నాడని.. సోదరుడు వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. రేణయ్య భార్య, కుమారుడు గతంలోనే మృతి చెందినట్లు తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

జడ్చర్ల: పట్టణంలోని వెంకటేశ్వరకాలనీలో నివాసం ఉంటున్న మహేశ్ కన్నారెడ్డి (30) ఆదివారం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. తిమ్మాజీపేట మండలం ఇప్పలపల్లికి చెందిన మహేశ్ కన్నారెడ్డి జడ్చర్లలోని సాయినగర్‌లో నివాసం ఉంటూ జిమ్ నిర్వహిస్తుండేవాడు. ఆర్థిక ఇబ్బందులు, భార్యాభర్తల మధ్య తగాదాలతో మనస్థాపానికి గురై ఆదివారం మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత బెడ్‌రూమ్‌లోకి వెళ్లి టవల్‌తో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గుర్తించిన భార్య టవల్‌ను లైటర్‌తో కాల్చి కిందకు దించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మహేశ్ కన్నారెడ్డి తండ్రి మంద శేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

యువతిపై అత్యాచారం.. కేసు నమోదు

నవాబుపేట: మండలంలోని ఓ గిరిజన తండాకు చెందిన 19 ఏళ్ల యువతిపై అదే తండాకు చెందిన ప్రేమ్‌కుమార్‌నాయక్ అత్యాచారం చేయగా కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. సోమవారం బాధితురాలు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టినట్లు వివరించారు. ప్రేమ్‌కుమార్‌నాయక్ గిరిజన సంఘంలో జిల్లాస్థాయి హోదాలో ఉండటంతో పాటు అధికారపార్టీ నాయకుడని.. అతడికి పెళ్లయి పిల్లలు కూడా ఉన్నారని చెప్పారు.

భార్య మృతిని తట్టుకోలేక భర్త ఆత్మహత్య

వనపర్తి రూరల్: భార్య మృతిని తట్టుకోలేక భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ జలేందర్‌రెడ్డి వివరాల మేరకు.. పెద్దగూడెం గ్రామానికి చెందిన కుమ్మరి రాములు (40 వ్యవసాయం చేసుకొని జీవనం సాగించే వాడు. అతడి భార్య వెంకటమ్మ ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. నాటి నుంచి అతడు తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లిన అతడు.. తన వ్యవసాయ పొలంలోని చెట్టుకు తాడుతో ఉరేసుకున్నాడు. ఆలస్యంగా గమనించిన స్థానికులు తాడును తొలగించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు కుమ్మరి తరుణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

'ఇథనాల్' అనుమతులు రద్దు చేయాలి


విలేకర్లతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

- రైతులపై కేసులు ఎత్తివేయాలి
- పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

గద్వాల క్రైం: పచ్చని పల్లెలను కాలుష్యమయం చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడం దుర్మార్గమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన సీపీఎం కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి హాజరైన ఆయన.. తిరుగు ప్రయాణంలో పార్టీ శ్రేణులతో కలిసి రాజోళి మండలం పెద్ద ధన్వాడ గ్రామ సందర్శనకు సిద్ధమయ్యారు. అయితే సమాచారం అందుకున్న పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్ కుమార్, పోలీసు సిబ్బంది వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసుల తీరును జాన్‌వెస్లీ తీవ్రంగా వ్యతిరేకించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన వ్యక్తినని చెప్పే సీఎం రేవంత్‌రెడ్డి పాలన ఇక్కడి ప్రజలకు శాపంగా మారిందన్నారు. పచ్చని పల్లెలు, వ్యవసాయ ఆధారిత కుటుంబాలు, కూలీలు జీవన మనుగడ కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మించవద్దని 11 గ్రామాల ప్రజలు శాంతియుతంగా ఆందోళన చేపడితే.. ఫ్యాక్టరీ నిర్వాహకులు బయటి వ్యక్తులతో దాడులు చేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బయటి వ్యక్తుల దాడులను ప్రతిఘటించిన రైతులు, ప్రజలపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. ఈ ఘటనలో లేని వ్యక్తులపై రాజకీయ జోక్యంతో కేసులు నమోదు చేయడం చూస్తుంటే, వ్యూహాత్మకమైన కుట్ర జరిగిందని చెప్పవచ్చన్నారు. న్యాయబద్ధమైన హక్కుల కోసం ప్రజలు నిలదీస్తే.. అధికారం అడ్డుపెట్టుకుని రైతులపై బూటకపు కేసులు నమోదు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని విమర్శించారు. రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయడంతో పాటు ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వాలు పనిచేయాలే తప్ప.. స్వలాభాలు, వారి ఏజెండాల కోసం పనిచేయడం దుర్మార్గమైన చర్యన్నారు. శ్రామిక, కర్షక, కూలీలు, ప్రజలకు సీపీఎం అండగా నిలబడి పోరాడుతుందన్నారు. అరెస్టయిన వారిలో సీపీఎం నాయకులు శ్రీరాంనాయక్, వెంకటస్వామి, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, ఈదన్న, రాజు, నర్సింహ తదితరులు ఉన్నారు.

కేంద్రం సమాధానం చెప్పాలి

గద్వాల టౌన్: ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్– పాక్ మధ్య నెలకొన్న యుద్ధం తన చొరవతోనే ఆగిందన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. భారతదేశ విదేశాంగ విధానంలో అమెరికా పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. భారత్ జపాన్‌ను వెనక్కి నెట్టి ప్రపంచంలో నాలుగో ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని గొప్పలు చెబుతున్న ప్రధాని మోదీ దేశంలో పెరుగుతున్న ఆర్థిక, సామాజిక అంతరాలకు గల కారణాలు ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. గత 11 ఏళ్ల బీజేపీ పాలనలో దేశంలో అట్టడుగు కులాలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రజల మధ్య విద్వేషాలు నింపి ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతుందని ఆరోపించారు. మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా లౌకిక శక్తులు ఏకం కావాలని, ప్రజాస్వామ్య శక్తుల బలోపేతంతోనే విద్వేశ రాజకీయాలకు చరమగీతం పాడగలమని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఆర్థిక పరిస్థితి పేరుతో వెనకడుగు వేయడం సరికాదన్నారు. గద్వాల జిల్లాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పేదలపై పెత్తనం చెలాయిస్తున్న బంగ్లా రాజకీయాలకు వ్యతిరేకంగా అట్టడుగు కులాలు ఐక్యమై ప్రజా పోరాటాల ద్వారా వారిని గద్దె దించాలని పిలుపునిచ్చారు.

అలంపూర్ ఆలయాల అభివృద్ధికి కృషి


సమీక్షలో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్, ఈఓ, సభ్యులు

అలంపూర్: జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధికి కృషి చేద్దామని ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి కోరారు. సోమవారం ఆలయంలో జరిగిన ధర్మకర్తల కార్యవర్గ సమీక్షలో ఆయన మాట్లాడారు. ఆలయాల ప్రాంగణంలో సీసీ రహదారుల పనులు పునః ప్రారంభించాలని, గోశాలలో ఆవుల సంఖ్య పెరగడం.. సిబ్బంది కొరతతో నిర్వహణ భారంగా మారిందని.. కొన్నింటిని ఇతర గోశాలలకు విక్రయించడం లేదా తరలించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అదేవిధంగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన వివిధ టెండర్ల బకాయిలు త్వరగా వసూలు చేయాలని తీర్మానించినట్లు చెప్పారు. వీటితోపాటు ఆదాయ వ్యయాలు, వెండి, బంగారు ఆభరణాలు, ఆలయ భూముల వివరాలను పరిశీలించారు. ఈ నెల 11న ఉదయం 11 గంటలకు అలంపూర్ ఆలయాల అభివృద్ధి హైలేవల్ కమిటీ సమావేశం ఉంటుందని ఈఓ పురేందర్‌కుమార్ చెప్పారు. సమావేశం ప్రసాద్ స్కీం భవనంలో కొనసాగనుండగా.. దేవాదాయ ధర్మాదాయశాఖ ఉన్నతాధికారులతో పాటు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, కలెక్టర్ హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశ నిర్వహణ, ఏర్పాట్లపై సమీక్షలో చర్చించారు. సమావేశంలో ధర్మకర్తల మండలి సభ్యులు నాగ శిరోమణి, గోపాల్, జగదీశ్వర్‌గౌడ్, అడ్డాకుల వెంకటేశ్వర్లు, విశ్వనాథరెడ్డి, వెంకటేశ్వర్లు, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

ఫినాయిల్ తాగి మహిళ ఆత్మహత్యాయత్నం

అమరచింత: పట్టణానికి చెందిన కుర్వ పద్మ కుటుంబ కలహాలతో ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలిలా.. పట్టణానికి చెందిన కుర్వపద్మ కొంత కాలంగా కుటుంబాన్ని పోషించుకునేందుకు కూలీ పనులకు వెళ్లేది. భర్త వెంకటేశ్ కొన్నేళ్ల కిందట అనారోగ్యంతో మృతిచెందాడు. పిల్లల పోషణ భారం అధికమవ్వడంతో కూలీ పనులు చేస్తూ వచ్చిన డబ్బుతో కుటుంబాన్ని పోషించేదని చుట్టుపక్కలవారు తెలిపారు. కొన్ని రోజులుగా కుటుంబ సమస్యలతో బాధపడుతున్న పద్మ సోమవారం ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు పాల్పడింది. చుట్టుపక్కలవారు గమనించి ఆత్మకూర్ ఆస్పత్రికి తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలుశిక్ష

ఆత్మకూర్: మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తికి న్యాయస్థానంలో రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ నరేందర్ సోమవారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. ఆత్మకూర్‌లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా, మండలంలోని మూలమళ్ల గ్రామానికి చెందిన శివరాజు మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డాడు. అతడిని కోర్టులో హాజరుపర్చగా.. న్యాయమూర్తి శ్రీలత రెండు రోజుల జైలుశిక్ష విధించారు. అతడిని మహబూబ్‌నగర్ జిల్లా జైలుకు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

సినీఫక్కీలో నగదు చోరీ


డబ్బులు పోగొట్టుకున్న బాధితుడితో మాట్లాడుతున్న సీఐ రాంబాబు

- బ్యాంకులో వ్యక్తి నుంచి రూ.లక్ష కొట్టేసిన అగంతకుడు
- గోల్డ్‌లోన్ రెన్యూవల్ చేసి బయటికొచ్చి చూసి కంగుతిన్న బాధితుడు


కొత్తకోట రూరల్: బ్యాంకులో సీసీ కెమెరాల మధ్యన క్యాష్ కౌంటర్ నుంచి రూ.లక్ష నగదు డ్రా చేసుకొని జేబులో పెట్టుకున్న ఓ వ్యక్తి నుంచి గుర్తు తెలియని వ్యక్తి సినీఫక్కీలో అపహరించిన ఘటన సోమవారం వనపర్తి జిల్లా కొత్తకోట యూనియన్ బ్యాంకులో చోటుచేసుకున్నదని సీఐ సీఐ రాంబాబు తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. అడ్డాకుల మండలం కన్మనూర్‌కు చెందిన మోడల శ్రీనివాసులు ఏడాది క్రితం కొత్తకోటలోని యూనియన్ బ్యాంకులో గోల్డ్‌లోన్ రూ.2లక్షలు తీసుకున్నాడు. రెన్యూవల్ చేసేందుకు వచ్చి రూ.2లక్షలు చెల్లించాడు. అనంతరం మళ్లీ గోల్డ్‌లోన్ రూ.లక్ష క్యాష్ కౌంటర్ నుంచి డ్రా చేసి ప్యాంట్ జేబులో పెట్టుకున్నాడు. రద్దీ ఎక్కువగా ఉండటంతో కౌంటర్ నుంచి పక్కకు వచ్చి 5 నిమిషాల తర్వాత జేబులో చూసుకోగా.. డబ్బులు లేకపోవడంతో బ్యాంకు మేనేజర్ దృష్టికి తీసుకెళ్లడంతోపాటు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ రాంబాబు సిబ్బందితో బ్యాంకు దగ్గరకు వచ్చి సీసీ కెమెరాలను పరిశీలించారు. బ్యాంకులో సైరన్ పనిచేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అంతేకాకుండా బ్యాంకులో సీసీ కెమెరాలు తక్కువగా ఉండడంతో దొంగను పట్టుకునేందుకు కాస్త ఇబ్బందిగా ఉందని, బ్యాంకులో సీసీ కెమెరాల సంఖ్య పెంచాలని మేనేజర్‌కు సూచించారు. బ్యాంకు సీసీ కెమెరాలతోపాటు చుట్టుపక్కల కెమెరాల్లో దొంగ వివరాలను పరిశీలిస్తున్నామని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆనంద్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి వృద్ధుడి దుర్మరణం

గద్వాల క్రైం: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన సోమవారం పట్టణ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. జిల్లా కేంద్రంలోని నల్లకుంటకాలనీకి చెందిన మిర్చి జలీల్ (70) ఉదయం పని నిమిత్తం బైక్‌పై జమ్మిచేడ్‌కు వెళ్లాడు. తిరిగి వస్తుండగా.. న్యూహౌజింగ్ బోర్డు కాలనీ సమీపంలో ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి కిందపడటంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

అన్నదమ్ముళ్లను మింగిన పాంపాండ్

అచ్చంపేట మండలం బొమ్మన్‌పల్లిలో విషాదం


అక్షిత్, చేతన్ (ఫైల్)

అచ్చంపేట రూరల్: తల్లిదండ్రులతో పాటు వ్యవసాయ పొలానికి వెళ్లిన ఇద్దరు అన్నదమ్ముళ్లను పాంపాండ్ (నీటి గుంత) రూపంలో మృత్యువు వెంటాడింది. కళ్లెదుట ఆడుకుంటూ కనిపించిన చిన్నారులు క్షణ కాలంలోనే విడతజీవులుగా మారడంతో ఆ తల్లిదండ్రుల రోధన మిన్నంటింది. ఈ ఘటన అచ్చంపేట మండలం బొమ్మన్‌పల్లిలో తీవ్ర విషాదాన్ని నింపింది. స్థానికుల వివరాల మేరకు.. బొమ్మన్‌పల్లికి చెందిన కుంభం సుధాకర్ – ధరణి దంపతులకు ఇద్దరు కుమారులు అక్షిత్(8), చేతన్ (6) ఉన్నారు. తమకు ఉన్న వ్యవసాయ పొలంలో సోమవారం పత్తి విత్తనాలు విత్తడానికి సిద్ధమయ్యారు. తమతో పాటు ఇద్దరు కుమారులను పొలానికి తీసుకెళ్లారు. పొలంలో తల్లిదండ్రులు పత్తి విత్తనాలు విత్తడంలో నిమగ్నం కాగా.. ఇద్దరు చిన్నారులు అక్కడే ఆడుకుంటూ సమీపంలో ఉన్న పాంపాండ్ వద్దకు వెళ్లారు. మొదట చేతన్ కాలుజారి నీటిగుంతలో పడిపోగా.. తమ్ముడిని బయటకు తీసుకొద్దామనే క్రమంలో అన్న అక్షిత్ అందులో పడిపోయాడు. ఇద్దరు నీటిలో మునిగి ఊపిరాడక మృతిచెందారు. అయితే తల్లిదండ్రులకు తమ కుమారులు కనిపించక పోవడంతో కేకలు వేశారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో అనుమానం వచ్చి పాంపాండ్‌లోకి దూకి చూశారు. అందులో ఇద్దరు చిన్నారుల మృతదేహాలు లభ్యమయ్యాయి. కళ్లెదుటే ఆడుకుంటున్న ఇద్దరు కుమారులు విగతజీవులుగా మారడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఇద్దరు చిన్నారుల మృతితో బొమ్మన్‌పల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిద్దాపూర్ ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

జూరాలకు నిలకడగా ఇన్‌ఫ్లో

ధరూరు/ దోమలపెంట/ మదనాపురం: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద నిలకడగా కొనసాగుతోంది. సోమవారం ప్రాజెక్టుకు 5 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. జల విద్యుత్ కేంద్రంలో ఒక యూనిట్‌లో విద్యుదుత్పత్తి ప్రారంభించారు. విద్యుదుత్పత్తికి 7,615 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 750, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు వదలగా.. మరో 92 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.591 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలంకు 8,508 క్యూసెక్కులు..

జూరాలలో సోమవారం విద్యుదుత్పత్తి చేస్తూ 7,615 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 893 మొత్తం 8,508 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయం వస్తున్నాయి. ప్రస్తుతం శ్రీశైలంలో 835.4 అడుగుల వద్ద 55.5655 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గత 24 గంటల వ్యవధిలో భూగర్భ కేంద్రంలో 0.613 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసి 1,308 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు.

రామన్‌పాడులో 1,016 అడుగులు..

రామన్‌పాడు జలాశయంలో సోమవారం పూర్తిస్థాయి నీటిమట్టం సముద్ర మట్టానికి పైన 1,021 అడుగులకు గాను 1,016 అడుగులకు చేరింది. జూరాల ఎడమ, కుడి కాల్వల ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. దీంతో జలాశయంలోని కుడి, ఎడమ కాల్వల ద్వారా 12 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వదిలినట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయానికి తాళం

- అద్దె చెల్లించనందుకు తెరవని యజమాని
- ఉన్నతాధికారుల ఆదేశాలతో ఉర్దూ మీడియం పాఠశాలలోకి మార్పు


ఎంపీడీఓ కార్యాలయానికి తాళం వేస్తున్న భవన యాజమాని సురేందర్

అమరచింత: ఏళ్ల తరబడి భవనం అద్దె ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు.. బకాయిలు చెల్లించే వరకు తాళం తెరవనంటూ సోమవారం ఎంపీడీఓ కార్యాలయానికి యాజమాని మహంకాళి సురేందర్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణానికి చెందిన సురేందర్ ఇంటిని ప్రతి నెల అద్దె రూ.10 వేలకు తీసుకొని ఎంపీడీఓ కార్యాలయం కొనసాగిస్తున్నారు. గతంలో బకాయి ఉన్న అద్దె మొత్తానికి రూ.3 లక్షల చెక్కును ఎంపీడీఓ అందించారు. ఎస్టీఓకు పంపినా డబ్బులు మాత్రం నేటికీ చేతికందకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ బకాయిలతో పాటు ప్రస్తుతం చెల్లించాల్సిన 5 నెలల అద్దె ఇచ్చేవరకు కార్యాలయానికి వేసిన తాళం తీయనని భీష్మించుకు కూర్చున్నారు. దీంతో ఎంపీడీఓ చెన్నమ్మతో సహా సిబ్బంది కార్యాలయం బయటే ఉండిపోయారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులు, మంత్రి వాకిటి శ్రీహరికి విన్నవించగా వారి ఆదేశాల మేరకు పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాల గదుల్లోకి మార్చేందుకు సిద్ధమై సామగ్రి, రికార్డులను తరలించారు. మంగళవారం నుంచి అక్కడే కార్యకలాపాలు ప్రారంభిస్తామని ఎంపీడీఓ వివరించారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న గదుల్లోకి ఎంపీడీఓ కార్యాలయం మార్చాలని గతంలో కలెక్టర్ సూచించడంతో అందుకు అనుగుణంగా మరమ్మతులు చేపట్టారు.

ఉత్సాహంగా మహిళా క్రికెట్ లీగ్


మహిళా జట్టును పరిచయం చేసుకుంటున్న ఎండీసీఏ చీఫ్ ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి

- తొలిరోజు రెడ్, బ్లూ జట్ల గెలుపు
- పోటీలను ప్రారంభించిన ఎండీసీఏ చీఫ్ ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ క్రీడలు: ఇంట్రా డిస్ట్రిక్ట్ ఉమెన్ క్రికెట్ లీగ్ అండర్– 25 జిల్లాకేంద్రం సమీపంలోని సమర్థ స్కూల్ మైదానంలో సోమవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. తొలి మ్యాచ్‌లో ఎండీసీఏ ఉమెన్స్ రెడ్ టీం 53 పరుగుల తేడాతో ఎండీసీఏ ఉమెన్స్ బ్లూ జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన రెడ్‌టీం నిర్ణీత 25 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసింది. కెప్టెన్ అనిత ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచింది. 45 బంతుల్లో 6 ఫోర్లతో 45 పరుగులు చేయడంతోపాటు రెండు వికెట్లు తీసి రెడ్ టీం గెలుపులో కీలకపాత్ర పోషించింది. ఇతర క్రీడాకారిణులు అక్షర 43, ప్రతీక 27 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన బ్లూ టీమ్ జట్టు 25 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 107 పరుగులు చేసింది. జట్టులో ప్రవళిక 24, స్రవంతి 21 పరుగులు చేశారు. రెడ్ జట్టు బౌలర్లు మహేశ్వరి 5 ఓవర్లలో 26 పరుగులు ఇచ్చి 4, సింధూజ 2 వికెట్లు తీశారు.

43 పరుగుల తేడాతో..

రెండో లీగ్ మ్యాచ్‌లో బ్లూ జట్టు 43 పరుగుల తేడాతో పింక్ జట్టుపై గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన బ్లూ జట్టు నిర్ణీత 25 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. జట్టులో కరీనా 34, ఆర్.స్వాతి 28, మంజుల 23 పరుగులు చేశారు. పింక్ జట్టు బౌలర్లు మేఘనాగౌడ్ 2, త్రివేణి, కవిత చెరో వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన పింక్ జట్టు బ్లూ బౌలర్ల ధాటికి వరుసగా వికెట్లను కోల్పోయింది. 19.1 ఓవర్లలో 79 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో పవిత్ర 20 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. బ్లూ జట్టు బౌలర్ దివ్య రాథోడ్ 4.1 ఓవర్లలో 20 పరుగులు ఇచ్చి 5 వికెట్లు తీయగా ప్రవళిక 2, నిర్మల, స్వాతి, తేజశ్రీ చెరో వికెట్ తీశారు.

భారత జట్టుకు ఆడాలి

జిల్లా క్రీడాకారిణులు క్రికెట్‌లో మెరుగైన ప్రతిభ కనబరిచి భారత జట్టుకు ఆడాలని ఎండీసీఏ చీఫ్ ప్యాట్రన్ వి.మనోహర్‌రెడ్డి అన్నారు. సమర్థ స్కూల్ మైదానంలో ఇంట్రా డిస్ట్రిక్ట్ ఉమెన్స్ క్రికెట్ లీగ్‌ను ప్రారంభించారు. క్రీడాకారిణులను ఆయన పరిచయం చేసుకొని మాట్లాడారు. క్రికెట్‌లో మహిళలకు మెరుగైన అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లాలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఉమెన్స్ క్రికెట్‌లో క్రీడాకారిణులు తమ ప్రతిభచాటాలని కోరారు. ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారిణులను క్రికెట్‌లో ప్రోత్సహించడం కోసం మొదటిసారిగా ఉమెన్స్ క్రికెట్ లీగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టోర్నీ నిర్వహిస్తున్నందుకు హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. లీగ్‌లో రాణించే క్రీడాకారిణులను త్వరలో హెచ్‌సీఏ టోర్నమెంట్‌కు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో సమర్థ స్కూల్ డైరెక్టర్ యాదయ్యగుప్తా, ఎండీసీఏ ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, వెంకటరామారావు, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా, సీనియర్ క్రీడాకారుడు ఆబెద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడిన నిందితుల రిమాండ్

- 5తులాల బంగారం రికవరీ
- నారాయణపేట డీఎస్పీ లింగయ్య


మక్తల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ లింగయ్య

మక్తల్: తాళాలు వేసిన ఇండ్లనే టార్గెట్ చేసి వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిట్లు నారాయణపేట డీఎస్పీ లింగయ్య పేర్కొన్నారు. సోమవారం మక్తల్‌లో పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మక్తల్ మండలంలోని జక్లేర్‌కు చెందిన సుభమ్ విష్ణువర్ధన్‌రెడ్డి నవంబర్ 11వ తేదీన ఇంటి తాళాలు విరగ్గొట్టి చోరీ చోటుచేసుకున్న ఘటనపై ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్పీ యోగేశ్‌గౌతమ్ ఆదేశాల మేరకు దర్యాప్తు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. సోమవారం నారాయణపేట క్రాసింగ్ వద్ద తనిఖీలు చేపడుతుండగా.. పోలీసులను చూసి పారిపోతున్న ఎండీ గౌస్, హన్మంతును మక్తల్ పోలీసులు పట్టుకొని విచారించారు. కర్ణాటకలోని సింధనూర్‌కు చెందిన ఎండీ గౌస్, రాయిచూర్‌లోని దేవదుర్గకు చెందిన హన్మంతుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. వీరు తాళాలు వేసిన ఇండ్లనే టారెట్ చేయడం చేసి చోరీలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్, దేవరకద్ర, మరికల్, మక్తల్‌లో చోరీలు చేసినట్లు ఒప్పుకొన్నారు. వారినుంచి 5తులాల బంగారం రికవరీ చేశామని, సుమారు రూ.4లక్షల50వేలు ఉంటుందని పేర్కొన్నారు. సోమవారం వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చోరీ కేసుల్లో మక్తల్ సీఐ రాంలాల్, ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి, కృష్ణ ఎస్సై నవీద్, క్రైమ్ పోలీసులు అశోక్, శ్రీకాంత్, నరేశ్, శశి పనితీరును డీఎస్పీ అభినందించారు. పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు.